

పర్యాటకం.. అభివృద్ధికి దూరం

సహజ అందాలకు నిలయమైన కడెం ప్రాజెక్టు, ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. పర్యాటకుల సంఖ్యకు తగ్గ సౌకర్యాలు మాత్రం లేవు. 10లో▸

అల్లుడిని హతమార్చిన అత్త



అత్త చేతిలో అల్లుడు హతమైన సంఘటన ముధోల్ మండలం తరోడలో జరిగింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.3 /26.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ద్రోణి ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘గడ్డెన్న’ నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు మంగళవారం సాగునీటిని ఎమ్మెల్యే పి రామారావు పటేల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నీరు లేకున్నా.. సరైన వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సాగునీరు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని కుంసర, కామోల్‌తోపాటు లోకేశ్వరం మండలం పుస్పూర్ తదితర గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డీఈఈ అనిల్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ నాయకులు భీంరావ్, పట్టణ అధ్యక్షుడు రావుల రాము, నాయకులు పోశెట్టి, పండిత్ రావ్, తూమోల్ల దత్తాత్రి, అనిల్, లోకేశ్వరం మండల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో రాఖీ కౌంటర్



రాఖీ కౌంటర్‌ను ప్రారంభించిన డీఎం పండరి

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో రాఖీ కౌంటర్‌ను డిపో మేనేజర్ పండరి మంగళవారం ప్రారంభించారు. దూర ప్రాంతాలలో ఉన్న సోదరులకు రాఖీ కట్టడానికి వెళ్లలేని సోదరీమణుల కోసం ఈ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటర్ వద్ద వచ్చి బుక్ చేసుకుంటే.. రాఖీలు వేగంగా, భద్రంగా కార్గోలో చేరవేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కిశోర్, స్టేషన్ మేనేజర్ ఏఆర్.రెడ్డి, కంట్రోలర్లు పీఆర్.గోపాల్, గజపతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌ఖిల్లా: బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రంలో డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్, అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ యు.గంగాధర్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ తదితర మూడేళ్ల డిగ్రీ కోర్సులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. రెగ్యులర్ ఇంటర్మీడియట్‌తోపాటు ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇతర రెండేళ్ల డిప్లొమా కోర్సులు పాసైన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని వివరించారు. దరఖాస్తులకు ఈనెల 13వ తేదీలోగా యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 73829 29703, 99488 13998 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుత్ లేని గ్రామాల సర్వే



సర్వే చేస్తున్న డీఎఫ్‌వో నాగిని భాను, సిబ్బంది

పెంబి: మండలంలో విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలను అటవీ, విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం సర్వే చేశారు. సింగిల్ విద్యుత్ సౌకర్యం లేని చాకిరేవు, సోముగూడ, త్రీఫేజ్ సౌకర్యం లేని కోసగుట్ట, కొత్తగూడ, గుమ్మెన ఎంగ్లాపూర్, ఒడ్డెగుడెం, గోధుమ గ్రామాలను సర్వే చేసినట్లు డీఎఫ్‌వో నాగిని భాను తెలిపారు. నివేదికలు తయారు చేసి సంబంధిత అధికారులను పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో శివకుమార్, పెంబి ఎఫ్ఆర్‌వో రమేశ్‌రావు, విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు మెమో

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి, బావాపూర్(ఆర్), చందునాయక్ తండా పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెమో జారీ చేశామని ఎంపీవో రత్నాకర్‌రావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల హాజరులో భాగంగా ప్రతీరోజు చేయాల్సిన ఫేస్(ముఖ) రికగ్నేషన్‌కు బదులు ఫేక్ రికగ్నేషన్ చేసినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండడంతోపాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీరోజు ఫేస్ రికగ్నేషన్ చేయాలని తెలిపారు.

▶ కాకతీయ.. ఇదేం కథ..!?



ఇది.. కాకతీయ యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్. ఇందులో.. నిర్మల్‌లో కాకతీయ విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల (పీజీ సెంటర్) అక్టోబర్ 1991లో స్థాపించబడిందని, ఈ కళాశాల సోషియాలజీలో ఎం.ఫిల్‌తో పాటు ఇంగ్లిష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంకామ్, పీజీ డీసీఏ సబ్జెక్టులలో పీజీ కోర్సులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆదివాసీ మ్యూజియంను బలోపేతం చేయడానికి ఐటీడీఏ, డీఆర్‌డీఏ, జిల్లా సంస్థల సహకారాన్ని తీసుకుంటున్నట్లు తెలిపారు. కళాశాలలో తరగతి గదులు, రెండు సెమినార్ హాళ్లు, లైబ్రరీ, ఒక కంప్యూటర్ ప్రయోగశాల ఉన్న విశాలమైన భవనంగా పేర్కొన్నారు. ప్రత్యేక భవనంలో విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కూడా ఉన్నట్లు చెబుతున్నారు. కానీ.. ఇవన్నీ ఒకప్పుడు ఉండేవి. ఇప్పుడు కేవలం భవనం తప్పా.. పైవేవీ నిర్మల్ పీజీ సెంటర్‌లో లేవు. కాకతీయ అధికారిక వెబ్‌సైట్‌లో పాతముచ్చట్లనే కొనసాగిస్తూ.. అందరినీ మభ్యపెడుతోంది.

▶ నిర్మల్ కాలేజీ.. ఆసిఫాబాద్‌కు..



ఇది.. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలపై అంతస్తులో మహిళా డిగ్రీ కళాశాల కోసం కేటాయించిన తరగతి గది. ఇప్పుడు ఈ క్లాసులు ఖాళీగానే ఉంటున్నాయి. ఎందుకంటే.. ఇక్కడ ఉన్న మహిళా డిగ్రీ కళాశాలను ఆసిఫాబాద్ తరలించేశారు. జిల్లాకేంద్రంలో కాకుంటే.. డిగ్రీ కాలేజీ డిమాండ్ ఉన్న ఖానాపూర్‌లోనైనా ఈ కాలేజీని పెట్టాల్సింది. అలా చేయకుండా.. ఎక్కడో ఉన్న ఆసిఫాబాద్‌కు తరలించేశారు. ఇప్పటికీ అక్కడ నిర్మల్ కాలేజీ పేరిటనే కొనసాగుతోంది. ఉన్నతవిద్యను అందించే ఓ కాలేజీ తరలిపోయినా స్థానిక పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరం.

ఉన్నత విద్య.. ఉత్తదే!

- పేరుకే పీజీ కాలేజీ..
- కోర్సులు, చదువులు గాలికి..
- ఆదివాసీ మ్యూజియం మూసివేత..
- పాతకథలు చెబుతున్న ‘కాకతీయ’..!
- డిగ్రీ కాలేజీనీ పంపించేశారు
- ఇప్పటికీ ‘పాఠం’నేర్వని నిర్మల్ జిల్లా..



నిర్మల్‌లోని పీజీ సెంటర్

నిర్మల్: యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సినచోట కనీసం డిగ్రీ కాలేజీలనూ ఉంచడం లేదు. కొత్త కోర్సులు పెట్టడం అటుంచి, ఉన్న వాటినీ తరలించేస్తున్నారు. పేదవిద్యార్థులకు పైచదువులు అందకుండా రెగ్యులర్ కోర్సులను సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులుగా మార్చేశారు. పీజీ సెంటర్‌లో ఉమ్మడిజిల్లా ఆదివాసీ సంస్కృతిని కళ్లకు కట్టించిన మ్యూజియాన్నీ మాయం చేశారు. చదువులతల్లి కొలువైన జిల్లాలో ఉన్నతవిద్య ఉత్తమిథ్యగా మారింది.

ఇదేం ‘పరీక్ష’..!?

ఈ మధ్యనే కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీకి సంబంధించిన ఇంటర్నల్ పరీక్షలు నిర్వహించారు. నిర్మల్ పీజీ సెంటర్‌లోనూ పరీక్షలు పెట్టారు. కానీ.. ఈ విషయం అసలు ఎవరికీ తెలియదు. గుట్టుచప్పుడు కాకుండా హన్మకొండ యూనివర్సిటీ నుంచి ఒకరు వచ్చి, ఐదురోజులు నిర్వహించాల్సిన పరీక్షలన్నీ ఒకేరోజు పూర్తిచేసి వెళ్లిపోయారు. అంతే.. అలా ఇంటర్నల్స్ పూర్తిచేసేశారు. అసలు అధ్యాపకులే లేని, క్లాసులే నిర్వహించని కాలేజీలో పరీక్షలు ఇంకెలా ఉంటాయి మరి. ఇదొక్క ఉదాహరణ చాలు జిల్లాలో ఉన్నత విద్య తీరు ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి. దశాబ్దకాలంగా విద్యావంతులు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఎంత గొంతెత్తుతున్నా.. అటు కేయూ పట్టించుకోవడం లేదు. ఇటు జిల్లా పాలకులూ నిర్లక్ష్యం వీడటం లేదు.

ఎన్నాళ్లీ నిర్లక్ష్యం..!?

ప్రజల అమాయకత్వమా..!? నాయకుల అవగాహన లోపమా..!? పాలకుల నిర్లక్ష్యమా..!? అధికారుల పట్టింపులేనితనమా..!? ఏది ఏమైతేనేం ఎడ్యుకేషన్ హబ్‌గా మారాల్సిన జిల్లా, ఉన్న కాలేజీలు, కోర్సులు పోయి ఖాళీ అవుతోంది. రేపటి తరానికి ‘ఇక్కడ కాలేజీ ఉండేది..’ అని ఉత్త భవనాలను చూపెట్టాల్సిన దుస్థితి వచ్చింది. ప్రతీ పీజీ సెంటర్ వైఎస్సార్ హయాంలో యూనివర్సిటీగా ఎదిగితే.. నిర్మల్ పీజీ సెంటర్ మాత్రం ఉల్టా అయ్యింది. స్థానికంగా ప్రజలు, పాలకులు, అధికారులు, అన్నివర్గాల నుంచి సరైన స్పందన లేనికారణంగానే ఈ దుస్థితి దాపురించినట్లు విద్యావంతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ‘జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ’ కోసం జిల్లావాసులు ఉద్యమించాల్సిన అవసరం ఉందంటున్నారు.

‘ఆదివాసీ మ్యూజియం’ మాయం..



మ్యూజియంను పరిశీలిస్తున్న వర్సిటీ అధికారులు, పీజీసెంటర్ అధ్యాపకులు(ఫైల్)

సోషియాలజీ డిపార్ట్‌మెంట్‌కు అనుసంధానంగా నిర్మల్ పీజీ సెంటర్‌లోనే ఆదివాసీ మ్యూజియం ఏర్పాటు చేశారు. అప్పటి అధ్యాపకులు, విద్యార్థులు తీవ్రంగా శ్రమించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివాసీల గూడేలకు వెళ్లి.. వారి సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడమే కాకుండా వారి పనిముట్లు, ఆభరణాలు, ఫొటోలను, వస్తువులను సేకరించారు. అప్పట్లో ఉన్న కేయూ వీసీ వచ్చి ఈ మ్యూజియం ప్రారంభించారు. దీని నిర్వహణకు ఏడాదికి రూ.50 వేల చొప్పున ఫండ్ ఇచ్చేవారు. అలాంటి అరుదైన ఆదివాసీ మ్యూజియాన్ని ఇప్పుడు కనుమరుగు చేశారు. అప్పటి వస్తుసంపద కూడా మాయమైంది. ఇచ్చిన నిధులకూ లెక్క లేదు. మ్యూజియంలోనే కాదు.. పీజీ సెంటర్‌లోని లైబ్రరీ పేరిట కూడా నిధులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



మ్యూజియంలో ఉన్న వస్తువులు(ఫైల్)

భూములు భద్రం.. హక్కులు పదిలం

- రైతులకు భూభారతి శ్రీరామ రక్ష
- ఆగస్టు 15 నాటికి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు పరిష్కారం
- కోర్టు కేసులు, సాదా బైనామాల అమలు కోర్టు అనుమతి వస్తేనే..
- ‘సాక్షి’తో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్



నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన భూభారతి చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది. అలాగే రైతులకు శ్రీరామరక్షగా నిలుస్తుంది. భూములు, హక్కులు భద్రంగా ఉంటాయి’ అని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎల్.కిశోర్‌కుమార్ అన్నారు. ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్ల డించారు. భూ భారతి చట్టం అమలు, జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం తదితర వివరాలను ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: అసైన్డ్ భూమిని వ్యక్తిగత అవసరాలకు విక్రయిస్తే కొన్నవారికి హక్కులు వర్తిస్తా యా? రికార్డులో పేరు మార్చే అవకాశం ఉందా?

అదనపు కలెక్టర్: అసైన్డ్ భూమి పొందిన వ్యక్తి తన భూమిని అమ్ముకోవడానికి ఎటువంటి హక్కులు ఉండవు. ఒకవేళ అసైన్డ్ భూమిని అమ్మితే.. అమ్మిన వ్యక్తికి కొన్న వ్యక్తికి ఇద్దరికీ నోటీసులు అందజేసి హెచ్చరించి మొదటి వ్యక్తికే భూమి చెందుతుంది. ఒకవేళ అదే వ్యక్తి మరోసారి భూమిని అమ్మకానికి పెడితే కొనుగోలు చేసిన వ్యక్తి ఆ భూమిలో కాస్తులో ఉంటూ.. పేద కుటుంబానికి చెందిన వారై ఉండాలి. అప్పుడు అసైన్డ్ కమిటీ సిఫారస్ మేరకు రికార్డులో కొత్త వారి పేరు నమోదు చేసేందుకు అవకాశం ఉంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారు ఇచ్చే నివేదిక ఆధారంగా కమిటీ నిర్ణయం తీసుకుంటుంది.

ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో ఎన్నిరకాల భూసమస్యలపై దరఖాస్తులు అందాయి?

అదనపు కలెక్టర్: సక్సెషన్, మ్యుటేషన్, డీఎస్ పెండింగ్, మిస్సింగ్ సర్వే నంబర్లు, మిస్సింగ్ ల్యాండ్, సాదాబైనామా అమలు, ఆసైన్డ్ ల్యాండ్, అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. కోర్టు పరిధిలో ఉన్న వాటిని పెండింగ్‌లో ఉంచి మిగతా దరఖాస్తులు పరిష్కరించే ప్రక్రియ ప్రారంభించాం.

ప్రశ్న: భూ భారతి చట్టంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరుతుంది?

అదనపు కలెక్టర్: ధరణిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉండేది కాదు. నేరుగా కోర్టును ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో రైతులు ఏళ్లపాటు కోర్టుల చుట్టూ తిరగడం, డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చేది. భూభారతి చట్టంతో ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో మునుపటిలా కోర్టులు నిర్వహించే అవకాశం ఉంది.

ప్రశ్న: భూభారతి చట్టంపై అమలుపై తహసీల్దార్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

అదనపు కలెక్టర్: భూ భారతి చట్టంపై ఇప్పటికే పలు మార్లు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఏదైనా సమస్యలు ఎదురైతే ఎప్పటికప్పుడు వారికి సలహాలు, సూచనలిస్తూ దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

ప్రశ్న: ప్రభుత్వ భూమిని ఏళ్లుగా సాగు చేస్తూ రికార్డులేని వారికి హక్కులు కల్పిస్తారా?

అదనపు కలెక్టర్: ఈ అంశంపై జిల్లాలో కొన్ని దరఖాస్తులు వచ్చాయి. రెండున్నర ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న పేదలకు హక్కు కల్పిస్తాం. అసైన్డ్ కమిటీల నియామకం తర్వాత వారికి కమిటీ సిఫారస్ మేరకు రికార్డు ప్రకారం హక్కు కల్పిస్తాం.

ప్రశ్న: వారసత్వ భూములకు మ్యుటేషన్ ఎలా?

అదనపు కలెక్టర్: జిల్లావ్యాప్తంగా మ్యుటేషన్ కోసం 587 దరఖాస్తులు వచ్చాయి. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ స్థాయిలో విచారణ జరిపి మ్యుటేషన్ చేస్తారు. ఈ చట్టం ద్వారా నిర్ణీత వ్యవధిలో కాకపోతే ఆటోమెటిక్ మ్యుటేషన్ అయిపోతుంది. ఈ చట్టంలో చాలావరకు సమస్యలు పరిష్కారమవుతాయి.

ప్రశ్న: రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం పురోగతి ఎలా ఉంది?

అదనపు కలెక్టర్: జూన్ మొదటి వారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో జిల్లావ్యాప్తంగా 16,855 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 9,538 పైచిలుకు దరఖాస్తుల పరిష్కారానికి నోటీసులు జారీ, అభ్యంతరాలు స్వీకరించాం. సుమారు 2,600 దరఖాస్తుల పరిష్కారానికి అధికారిక ఆమోదం ఇచ్చాం. ఇప్పటి వరకు 3,888 దరఖాస్తులు తిరస్కరించాం.

ప్రశ్న: ఆక్రమణకు గురైన ప్రభుత్వ, శిఖం భూములను చట్టంతో కాపాడే వీలు ఉందా?

అదనపు కలెక్టర్: ప్రభుత్వ భూమి, చెరువులు, కుంటలు కబ్జా చేసినట్లు అధికారుల దృష్టికి వస్తే వాటిని స్వాధీనం చేసుకునే అధికారం ఉంది. ఇలాంటి ఘటనలు ఏమైనా ఉంటే ప్రజలు మా దృష్టికి తీసుకురావాలి.

ప్రశ్న: ఆగస్టు 15లోగా వందశాతం పరిష్కారం సాధ్యమేనా?

అదనపు కలెక్టర్: రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారంలో ప్రస్తుతం రాష్ట్రంలోనే జిల్లా టాప్ టెన్‌లో ఉంది. సాధ్యమైనంత వరకు పూర్తి చేస్తాం. సిబ్బంది సహకరిస్తే మరింత పురోగతి పెంచుతాం.

ప్రశ్న: ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయి. వాటికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

అదనపు కలెక్టర్: ఆబాది, గ్రామకంఠం వంటి భూములకు గుర్తింపు సంఖ్య ఉంటుంది. కబ్జాకు గురికాకుండా చూస్తాం. ఆధార్ కార్డు లాగే త్వరలో భూధార్ సంఖ్య కూడా ఇస్తాం.

ప్రశ్న: చాలామంది రైతులకు పట్టాదారు పాసు బుక్ లేక ఇబ్బంది పడుతున్నారు.. ఈ చట్టంలో వచ్చే అవకాశాలున్నాయా..?

అదనపు కలెక్టర్: పట్టాదారు పాసుబుక్‌ల కోసం దరఖాస్తులు చేసుకుంటే విచారణ చేపట్టి జారీ చేస్తాం. రైతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం అన్నీ సక్రమంగా ఉంటే బుక్ తొందరగానే వస్తుంది.

బాల కార్మికుల జీవితాల్లో వెలుగు

- ఆపరేషన్ ముస్కాన్‌తో 57 మందికి విముక్తి
- 42 మందిపై కేసులు నమోదు

ఐదేళ్లలో గుర్తించిన బాల కార్మికులు....

సంవత్సరం	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్
2021	243	85
2022	138	52
2023	67	55
2024	80	69
2025	66	57



విద్యార్థిని పాఠశాలలో చేర్పిస్తున్న అధికారులు

నిర్మల్ టౌన్/లక్ష్మణచాంద: బాలలు బడిలో ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం బాలకార్మికుల విముక్తి కోసం ఏటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాల కార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పిస్తున్నారు. బాల కార్మికుల జీవితాలకు వెలుగునిస్తున్నారు. తాజాగా జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 57 మంది బాల కార్మికులను గుర్తించి, వారికి పని నుంచి విముక్తి కల్పించారు. కొందరిని తల్లిదండ్రులకు అప్పగించగా, మరికొందరిని పాఠశాలల్లో చేర్పించారు. పోలీస్, చైల్డ్ వెల్ఫేర్, కార్మిక, విద్య, ఆరోగ్య, బాలల సంరక్షణ విభాగాల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతం అయింది. నిబంధనలకు విరుద్ధంగా బాలలతో పని చేయించిన వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.

ఆపరేషన్ ముస్కాన్ లక్ష్యాలు..

ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన లక్ష్యం తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చడం, బాల కార్మిక వ్యవస్థ నుంచి రక్షించడం, పునరావాసం కల్పించడం. బాలలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, కిడ్నాప్‌లను అరికట్టడం, సురక్షిత వాతావరణం కల్పించడం. జిల్లాలో హోటళ్లు, ఇటుక బట్టీలు, వెల్డింగ్ షాపులు, నిర్మాణ పనులు, వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి, వారిని విద్య వైపు నడిపించేందుకు విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు.

57 మందికి కొత్త జీవితం..

నెల రోజుల ఆపరేషన్ ముస్కాన్‌లో జిల్లా వ్యాప్తంగా 57 మంది బాలలను గుర్తించారు, వీరిలో 50 మంది బాలురు, ఏడుగురు బాలికలు. నిర్మల్ డివిజన్‌లో 25 మంది, భైంసా సబ్ డివిజన్‌లో 17 మందిపై కేసులు నమోదు చేయగా, మిగిలిన వారికి జరిమానా విధించారు. గుర్తించిన బాలలను తల్లిదండ్రులకు అప్పగించి, కౌన్సెలింగ్ చేశారు. పాఠశాలల్లో చేర్పించారు. ఈ చర్యలు వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాయి.


ప్రత్యేక పర్యవేక్షణ..

జిల్లా ఎస్పీ ఆపరేషన్ ముస్కాన్‌పై ప్రత్యేక దృష్టి సారించి, కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించారు. అధికారులు సమన్వయంతో బాల కార్మికులను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేశారు. నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ ఉపేంద్రారెడ్డి నాయకత్వం వహించగా, డీసీపీవో మురళి, ఎస్సైలు నరేష్, సందీప్, కానిస్టేబుల్ ప్రశాంత్, ఆరోగ్య, విద్య, కార్మిక శాఖలు, ఎన్జీవో సభ్యులతో కూడిన ప్రత్యేక బృందం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసింది.

ఆపరేషన్ ముస్కాన్‌లో పరిష్కరించిన కొన్ని ఘటనలు..

1. తాంద్ర గ్రామంలో 13 ఏళ్ల బాలుడు ఓ షాప్‌లో పనిచేస్తూ కనిపించాడు. ముస్కాన్ బృందం కౌన్సెలింగ్ నిర్వహించి, అతన్ని తిరిగి పాఠశాలలో చేర్పించింది.
2. నవీపేట మండలం, సిర్నాపల్లికి చెందిన 12 ఏళ్ల బాలుడు 6వ తరగతి మధ్యలో చదువు మానేసి, నిర్మల్‌లో సోఫా తయారీ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడిని గుర్తించి యజమానిపై కేసు నమోదు చేసి, బాలుడిని సోదరునికి అప్పగించారు.
3. భైంసా పట్టణంలో 13 ఏళ్ల బాలుడు 8వ తరగతి మధ్యలో మానేసి వెల్డింగ్ షాప్‌లో పనిచేస్తుండగా గుర్తించి అతడికి విముక్తి కల్పించారు. బాలుడిని పనిలో పెట్టుకున్న యజమానిపై కేసు నమోదు చేశారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.
4. లోకేశ్వరం గ్రామంలో 11 ఏళ్ల బాలుడు 5వ తరగతి మధ్యలో ఆపి గొర్రెలు కాస్తుండగా, ముస్కాన్ బృందం అతడిని పాఠశాలలో చేర్పించింది.
5. నిర్మల్ పట్టణంలో ఇద్దరు బాలలు వెల్డింగ్ షాప్‌లో పనిచేస్తూ కనిపించగా, వారిని స్కూల్‌లో చేర్పించి, యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.
6. భైంసా పట్టణంలో 15 ఏళ్ల బాలుడు నాలుగేళ్ల క్రితం చదువు మానేసి, లైటింగ్ బల్బులు మోస్తుండగా, కౌన్సెలింగ్ ద్వారా తిరిగి పాఠశాలకు పంపారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



బాల కార్మిక వ్యవస్థ ప్రోత్సహిస్తున్న వారిపై కేసు నమోదు చేస్తున్నాం. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. మళ్లీ ఎవరైనా దుకాణాల యజమానులు పిల్లలను పనిలో పెట్టుకుంటే డయల్ 100 లేదా 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. పిల్లలను కాపాడే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి. వారికి మంచి భవిష్యత్ కల్పించాలి. ఆపరేషన్ ముస్కాన్‌తో జిల్లాలో బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించాం.

– జానకీ షర్మిల, ఎస్పీ

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో ఆగస్టు 15న జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాట్లపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలకు ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులకు ఆహ్వానాలు పంపించాలన్నారు. సీటింగ్ ఏర్పాట్లు క్రమబద్ధంగా ఉండాలని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా దేశభక్తి ప్రతిబింబించాలని సూచించారు. వేదిక వద్ద తాగునీరు, పండ్లు, ఫలహారాలు విద్యార్థులకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేలా శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నిర్మల్‌ఖిల్లా: విద్యారంగంలో ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రిటైర్డ్ ఉపాధ్యాయులకు పెన్షన్ బెనిఫిట్‌లు, ఉపాధ్యాయులకు కేడర్ల వారీగా బదిలీలు పదోన్నతులు చేపట్టాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఈవో, డీఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ల వంటి ఖాళీలు పదోన్నతులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు 40% వాటాను జూనియర్ లెక్చరర్ల పదోన్నతుల్లో పునరుద్ధరించాలని పేర్కొన్నారు. 317 జీవో కారణంగా స్థానికతకు దూరంగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను స్వస్థలాలకు బదిలీ చేయాలని పేర్కొన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 23న హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నాలో కమిటీ రాష్ట్ర నాయకులు జాదవ్ వెంకట్రావు, జిల్లా యూఎస్‌పీసీ నాయకులు దాసరి శంకర్, పెంట అశోక్, షబ్బీర్ అలీ, విజయ్ కుమార్, రాజేశ్ నాయక్, మహేంద్రచారి, సాజిద్, రాజేశ్వర్, వీరేశ్, బలిరాం, సమగ్రశిక్ష జిల్లా కార్యవర్గ సభ్యులు గజేందర్, హరీశ్, కావ్య, స్నేహ, లింగన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై మంగళ వారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గీతేశ్వర్ కొంత కాలంగా విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. వెకిలిచేష్టలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. సదరు విద్యార్థినుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

ఇంద్రవెల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దొడందా గ్రామంలోని మెస్రం తుల్సిరాం అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా ఎర్తింగ్ వైర్‌కు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. కాగా విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఎర్తింగ్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఎద్దు మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై

కాసిపేట: మండలంలోని కోమటిచేను గ్రామంలో రాంటెంకి శివరాంపై దాడి చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన జాడి రవి, అతని కుమారుడు జాడి సాయికుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గత నెల 25న రాత్రి శివరాంపై కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

స్కూల్ విద్యార్థుల ఆటో బోల్తా

- ఇద్దరికి స్వల్పగాయాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలో పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. నారాయణపూర్ నుంచి మంగళవారం తొమ్మిది మంది స్కూల్ విద్యార్థులను ఎక్కించుకున్న ఆటో బావురావుపేట సమీపంలోని ఆస్నిసి పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు విద్యార్థులను బయటకు తీశారు. ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలు కావడంతో 108కు సమాచారం అందించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

ఆటో టైర్లు చోరీ


టైర్లు చోరీకి గురైన ఆటో

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్‌లో సోమవారం రాత్రి ఆటో టైర్లు చోరీకి గురైనట్లు వాహన యజమాని ఏముర్ల రాకేష్ తెలిపారు. ఎప్పటిలాగే తన ఇంటి ముందు పార్కింగ్ చేశానని, రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో మూడు టైర్లను అపహరించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నకిలీ బాబాలపై కేసులు

ఆదిలాబాద్‌టౌన్: అమాయక ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్న నకిలీ బాబాలపై కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా నకిలీ బాబాల భరతం పట్టేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఏకకాలంలో జిల్లా వ్యాప్తంగా దాడులు జరిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన జుబేర్, ఖానాపూర్‌కు చెందిన ఉస్మాన్‌లపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి తావీతులు, విభూది, నిమ్మకాలు, తదితర వాటిని ఇస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బేల, ఇచ్చోడలో ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి వరకు ఈ దాడులు జరిగాయి.

పర్యాటకం.. అభివృద్ధికి దూరం

- కడెం.. సహజ సౌందర్య నిలయం
- ఏడాది పొడవునా పర్యాటకుల రాక
- శిథిలావస్థకు డీలక్స్ బోటు
- మూలనపడిన స్పీడ్ బోటు
- పట్టించుకోని పర్యాటక శాఖ


బోటింగ్ చేస్తున్న పర్యాటకులు (ఫైల్)


మరమ్మతులకు నోచుకోని స్పీడ్ బోటు


బోటింగ్ పాయింట్ వద్ద పర్యాటకులు

కడెం: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయంగా నిలిచిన కడెం ప్రాజెక్టు, రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. 2010లో పర్యాటక శాఖ బోటింగ్‌ను ప్రవేశపెట్టడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరిగింది. ఈ అందమైన ప్రాజెక్టును తిలకించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. అయితే, పెరిగిన పర్యాటకుల సంఖ్యకు తగ్గ సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కడెంను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా..

2010లో బోటింగ్ ప్రవేశపెట్టినప్పటి నుంచి కడెం ప్రాజెక్టు పర్యాటక రంగంలో గణనీయమైన ఆదరణ పొందింది. 2015లో 12 విడిది గదులు, రెస్టారెంట్‌తో కూడిన హరిత రిసార్ట్స్‌ను ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రస్తుతం హరిత రిసార్ట్స్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. పర్యాటకుల విడిది కోసం ఒక రిసార్ట్, రెండు లాడ్జీలు అందుబాటులో ఉన్నాయి. ఈ సౌకర్యాలతో కడెం రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందింది.

అభివృద్ధి లేక ఇబ్బందులు..

కడెం బోటింగ్ యూనిట్‌లో ఒక డీలక్స్ బోటు, స్పీడ్ బోటును ప్రవేశపెట్టినప్పటికీ, సౌకర్యాల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. గతంలో రూ.30గా ఉన్న బోటింగ్ టికెట్ ధరను రూ.50కి పెంచారు, కానీ సౌకర్యాలు మెరుగుపరచకపోవడంతో ఆదాయం గణనీయంగా తగ్గింది. స్పీడ్ బోటు మోటారు చెడిపోయి సంవత్సరాలు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో అది మూలన పడింది. డీలక్స్ బోటు శిథిలావస్థలో ఉన్నప్పటికీ, తాత్కాలిక మరమ్మతులతో నడుపుతున్నారు. బోటింగ్‌కు 16 మంది లేదా రూ.600 చెల్లించాల్సిన నిబంధన వల్ల చాలా మంది పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

శిథిలావస్థలో సౌకర్యాలు..

కడెం బోటింగ్ స్టాండ్‌ను గతంలో రాత్రికి రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా సోమశీలకు తరలించారు, దాని స్థానంలో పాత స్టాండ్‌ను వదిలేశారు. ప్రస్తుతం ఈ స్టాండ్ కూడా శిథిలావస్థకు చేరింది. బోటింగ్ సిబ్బంది తాత్కాలికంగా తాళ్లు, తెప్పలతో దాన్ని నడిపిస్తున్నారు, దీంతో పర్యాటకులకు ప్రమాద భయం పొంచి ఉంది. సౌకర్యాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల గతంలో లక్షల్లో వచ్చిన ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది.

ప్రాజెక్టు అందాలు బాగున్నాయి



కడెం ప్రాజెక్టును విజిట్ చేశాం. ప్రకృతి సిద్ధమైన కడెం ప్రాజెక్టు అందాలు బాగున్నాయి. బోటింగ్ చేశాం. ఇక్కడ ఒకటే బోటు ఉంది. స్పీడ్ బోటుతో పాటు పైడల్ బోటు లాంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– దివ్య, పర్యాటకురాలు, రాజమండ్రి

అభివృద్ధి చేయాలి



మిత్రులతో కలిసి కడెం ప్రాజెక్టు సందర్శనకు వచ్చాం. కడెం ప్రాజెక్ట్, పరిసర ప్రాంతాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి. నీటి మధ్యలో ఉన్న ఐ ల్యాండ్ వరకు బోటును తీసుకెళ్తే బాగుంటుంది. ప్రాజెక్ట్‌లో వాటర్ గేమ్స్ లాంటివి ఏర్పాటు చేయాలి.

– చంద్రశేఖర్, పర్యాటకుడు, విజయవాడ

శిశుమందిరాల్లో విద్యతోపాటు క్రమశిక్షణ

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశం పట్ల భక్తిభావన పెంపొందించడంలో సరస్వతి శిశు మందిరాలు విశేష కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని కిసాన్ గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యాపీఠం ప్రాంత అధ్యక్షుడు తిరుపతిరావు, సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రాంత క్లైక్షనిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న దుర్గం రాజేశ్

దండేపల్లి: నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన నేతకానీ మహార్ సంక్షేమ సంఘం మండల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ప్రకటించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రత్యేక స్థానం కల్పించాలని, స్థానిక ఎన్నికల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాశ్, నర్సయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యువరాజు, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకులు శ్రీనివాస్, రాములు, రాజలింగు, పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

గిత్తే కార్తీక్‌కు ఆర్థికసాయం


శివాజీ ప్రతిమ బహూకరిస్తున్న సీడీ చౌహాన్

కెరమెరి: హిమాచల్ ప్రదేశ్‌లోని స్పీటీ వ్యాలిలో ఈ నెల 9నుంచి 19 వరకు నిర్వహించే మౌంట్ యూనమ్ పర్వతారోహనకు కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని కెలికే గ్రామానికి చెందిన మౌంటేనీయర్ గిత్తే కార్తీక్ ఎంపికయ్యాడు. సికింద్రాబాద్‌కు చెందిన గ్లోబల్ హిందూ ఫెడరేషన్, ఛత్రపతి శివాజీ మహారా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ సీడీ చౌహాన్ మంగళవారం ఛత్రపతి శివాజీ ప్రతిమతో పాటు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. సాహసయాత్ర పూర్తి చేసుకున్నాక మరో రూ.30 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. కాగా కార్తీక్ హైదరాబాద్‌లోని ఏఐఎంఎస్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ మౌంటనీరింగ్ కోర్సును గతంలో పూర్తి చేశాడు. ఎన్నో సాహస కృత్యాల్లో పాల్గొని అవార్డులు సొంతం చేసుకున్నాడు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి భవానీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఈ నెల 3న ఓ యువకుడిపై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడు పంగ శ్రీధర్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గద్దెరాగిడికి చెందిన ఊటూరి హరీష్ భవానీ బార్ దగ్గర ఉండగా అక్కడే ఉన్న శ్రీధర్ తనకు మద్యం ఇప్పించాలని కోరగా నిరాకరించడంతో మహేందర్, తిరుపతి అనే మరో ఇద్దరు స్నేహితులతో కలిసి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీధర్‌ను అరెస్టు చేసి అతనిపై రౌడీషీట్‌కు కూడా ఓపెన్ చేశామని, పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


నీలిమ (ఫైల్)

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై మజారొద్దీన్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని భగవంతంవాడకు చెందిన గోపు సత్యనారాయణ, భారతమ్మ దంపతుల కుమార్తె నీలిమ (37)కు గద్దెరాగడికి చెందిన లారీ డ్రైవర్ మానేం రాజేందర్‌తో వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. సదరు మహిళ కొంతకాలంగా కడుపు నొప్పి, గర్భసంచి సమస్యలతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఇటీవల తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 3న పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మహిళ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..


గణేశ్ (ఫైల్)

దండేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు నంబాల గ్రామానికి చెందిన కొండ గణేశ్ (32), ప్రవళిక దంపతులు కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. ఇద్దరూ కష్టపడి పనిచేస్తున్నా కుటుంబ అవసరాలకు డబ్బులు చాలడం లేదని గణేశ్ పలుమార్లు భార్యతో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈక్రమంలో మంగళవారం కూలీ పని నిమిత్తం ప్రవళికను బైక్‌పై తీసుకెళ్లి గ్రామ సమీపంలోని పత్తిచేను వద్ద దింపి వెళ్లాడు. మధ్యాహ్నం నంబాల బ్రిడ్జివద్ద పురుగుల మందు తాగి విషయాన్ని సోదరుడు రమేశ్‌కు ఫోన్‌చేసి చెప్పడంతో వెంటనే లక్సెట్టిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రైలు కిందపడి ఒకరు..

కాగజ్‌నగర్‌టౌన్: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని కాపువాడకు చెందిన మహ్మద్ షబ్బీర్ (52)మద్యానికి బానిసై ఇంట్లో కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బెల్లంపల్లి నుంచి బల్లార్షాకు వెళ్ళే గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

భుక్తాపూర్‌లో యువతి..

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఉట్నూర్‌కు చెందిన మౌనిక (25) ఆదిలాబాద్ పట్టణంలోని ఓ చెప్పుల దుకాణంలో పనిచేస్తూ భుక్తాపూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. సాయంత్రం షాపు నుంచి ఇంటికి వెళ్లిన యువతి ఉరేసుకుని అఘాయిత్యానికి పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..


కార్తీక్ (ఫైల్)

మందమర్రిరూరల్: భార్య కాపురానికి రావడం లేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఏఎస్సై మజీద్‌ఖాన్ తెలిపిన వివరాల మేరకు మందమర్రిలోని రెండవ జోన్‌కు చెందిన సింగరేణి కార్మికుడు శనిగారపు కార్తీక్ (30)కు హనుమకొండకు చెందిన లాస్యతో 2018లో వివాహమైంది. దంపతులకు కుమారుడు ఆర్యన్ (7), కూతురు ఆరాధ్య (5) ఉన్నారు. కుటుంబంలో గొడవలు జరగడంతో నెలరోజుల క్రితం లాస్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో మంగళవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని అన్న సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కడెం కాలువలో గుర్తుతెలియని మృతదేహం

దస్తురాబాద్: కడెం ఎడమ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మల్లాపూర్ గ్రామ సమీపంలోని కడెం ఎడమ కాలువలోని ముళ్లపొదల్లో మంగళవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. పూర్తిగా కుళ్లిపోయి ఉందని, మృతునికి 45 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎరుకల సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఓదెలు


నియామకపు పత్రంతో ఓదెలు

రామకృష్ణాపూర్: ఎరుకల ప్రజా సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన రేవెల్లి ఓదెలును ఎన్నుకున్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లో జరిగిన సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి నియామకపత్రం అందజేశారు. ఎరుకల ప్రజల అభివృద్ధి కోసం, ఎరుకల జాతి చైతన్యం కోసం తనవంతు కృషి చేస్తానని ఓదెలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన హాకీ క్రీడాకారులు

ఆదిలాబాద్: జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికై నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి తెలిపారు. ఆదిలాబాద్ ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలకు చెందిన కొడప ప్రదీప్, వెట్టి సుదర్శన్ ఎంపికయ్యారని, ఈ నెల 12 నుంచి పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

ఒకరిపై గంజాయి కేసు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి)లో ఒకరిపై గంజాయి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గ్రామానికి చెందిన పరశురాం తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేసినట్లు తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు నిర్వహించగా 23 గంజాయి మొక్కలు లభ్యమైనట్లు తెలిపారు. మొక్కలను ధ్వంసం చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అల్లుడిని హతమార్చిన అత్త

- కర్రతో తలపై బాది గొంతునులిమి హత్య
- ముధోల్ మండలంలోని తరోడలో ఘటన


షేక్ నజీమ్ మృతదేహం

తానూరు(ముధోల్): అత్త చేతిలో అల్లుడు హతమైన సంఘటన నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని తరోడలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమాయత్‌నగర్‌కు చెందిన షేక్‌నజీమ్(45) కుటుంబం పదేళ్ల క్రితం ముధోల్ మండలంలోని తరోడలో నివాసం ఉంటోంది. ఇటుకబట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. నజీమ్ అత్తగారైన రహీమున్నీసా వారితో కలిసి ఉంటోంది. వర్షాకాలం కావడంతో ఇటుకల తయారీ పనిలేక పోవడంతో మృతుని భార్య షేక్ సాహెబి ఈనెల 2న శనివారం మహారాష్ట్రలోని శివాని గ్రామానికి మేస్త్రీ పనికోసం వెళ్లింది. ఈ నెల 4న తెల్లవారు జామున నజీమ్ మద్యం సేవించి వచ్చి అత్తను లైంగికంగా వేధించడమే కాకుండా ఆమెపై చేయి చేసుకున్నాడు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు మద్యం మత్తులో ఉన్న నజీమ్ మళ్లీ ఆమెతో గొడవపడడంతో కర్రతో తలపై దాడిచేసి గొంతునులిమి హత్య చేసింది. మంగళవారం ఉదయం స్థానికులు అందించిన సమాచారం సీఐ మల్లేశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య షేక్ సాహెబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలు రహీమున్నీసాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


కూనారపు వంశీ(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అందుగులపేట మేడారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం రాత్రి 10.30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో కూనారపు వంశీ(32) మృతిచెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. దోర్నకల్‌కు చెందిన వంశీ తన భార్య స్వాతితో కలిసి ద్విచక్ర వాహనంపై అత్తగారి ఊరైన తాండూర్‌కు వెళ్తున్నాడు. అందుగులపేట వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా.. వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. వంశీకి భార్య స్వాతి, కుమారుడు ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడు..


మల్లయ్య (ఫైల్)

బజార్‌హత్నూర్: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కాండ్లి గ్రామానికి చెందిన పట్ల మల్లయ్య (60) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. సోమవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని భార్య పట్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నేరడిగొండ: మండలంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్చోడ మండలం సల్యాద గ్రామానికి చెందిన చిక్రం సోమేష్ (23) మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఇచ్చోడ మండలం సల్యాదకు చెందిన చిక్రం సోమేష్, తొడసం హన్మంతు ద్విచక్ర వాహనంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాయాదరికి వెళ్లి వస్తుండగా ఆరేపల్లి-కొరటికల్ జాతీయ రహదారి మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. చిక్రం సోమేష్ అక్కడికక్కడే మృతి చెందగా తొడసం హన్మంతుకు తీవ్రగాయాలయ్యాయి. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల వేటగాళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా పది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టి నాలుగు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి ఒక డబుల్ బోర్‌గన్, ఒక ఎయిర్‌గన్, జింక కొమ్ములతో కూడిన తల, రెండు జింక కొమ్ములు, కత్తులు, టార్చ్‌లైట్లు, వేట సామగ్రి, వైర్లు, బరిసెలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1, మావల పోలీసు స్టేషన్‌లో 2, తాంసి పోలీసు స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదిలాబాద్ పట్టణంలోని పంజేషా మొహల్లాకు చెందిన షోయబ్ అఫ్జల్ వద్ద ఒక డబుల్ బోర్‌గన్, జింక తల, రెండు జింక కొమ్ముల ముక్కలు, వేటకు ఉపయోగించిన సామగ్రి, కత్తులు, జాకెట్లు, షూలు లభించినట్లు చెప్పారు. మావల మండలంలోని వాగాపూర్‌కు చెందిన ఆత్రం మారుతి, ఆత్రం భీంరావు వద్ద 50 మీటర్ల జీవైర్, నైలన్ మెష్, జంతువులను వేటాడే సామగ్రి, ఒక ఈటె, ఎలక్ట్రిక్ వైర్ లభించినట్లు తెలిపారు. తాంసి మండలంలోని ఘోట్కురికి చెందిన షేక్ షరీఫ్ వద్ద ఎయిర్‌గన్ లభించినట్లు పేర్కొన్నారు. వారిపై ఆయా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, మావల సీఐ కర్రె స్వామి, ఎస్సై ఇసాఖ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.